

ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో

డీలా పడిన అన్నాడీఎంకే

● బీజేపీలో పెరిగిన జోష్ ● అధైర్యపడొద్దు: జయకుమార్



ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల్లో రాష్ట్రంలోని డీఎంకే కూటమి అధిక స్థానాలు చేజిక్కించుకుని ఘన విజయం సాధిస్తుందని తేలడంతో అన్నాడీఎంకే కార్యకర్తలు డీలా పడ్డారు. 2019 నాటి ఫలితాలే పునరావృతమవుతాయేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ జతకడతాయని అన్ని వర్గాలు భావించాయి. అయితే రాష్ట్రంలోని మైనారిటీల మనోభావాలను గ్రహించిన అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) బీజేపీకి దూరంగా జరిగారు. బీజేపీ నుంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, ఆయన తన మనసు మార్చుకోలేదు. దీంతో ఆ తరువాత జరిగిన పరిణామాలతో బీజేపీతో పీఎంకే జతకట్టిన విషయం తెలిసిందే. నిజానికి ఈ పార్లమెంటు ఎన్నికలను ఈపీఎస్ ఆదిలో తేలిగ్గా తీసుకున్నారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పెట్టుకున్న ఆయన.. ఈ ఎన్నికలను లైట్ తీసుకున్నారు. కానీ ఆ నిర్ణయం ఏమాత్రం సరి కాదని సీనియర్ల సలహాలతో చివరి నిమిషంలో మనసు మార్చుకుని, రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మర ప్రచారం చేపట్టారు. ఆయనతో పాటు సీనియర్ నేతలు కూడా ప్రచారం చేపట్టారు.

ఉత్సాహంలో బీజేపీ కార్యకర్తలు

ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీకి కనీసం మూడు స్థానాలు వస్తాయంటూ ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వెల్లడి కావడం పట్ల ఆ పార్టీ కార్యకర్తల్లో జోష్ నెలకొంది. గతంలో మూడుమార్లు బీజేపీకి ఒకే ఒక్క లోక్‌సభ స్థానం మాత్రమే వచ్చింది. అయితే ఈ సారి మాత్రం 3 స్థానాలు వచ్చే వరకు అవకాశముందని ఎగ్జిట్‌పోల్స్ చెబుతుండడం పట్ల ఆ పార్టీ క్యాడర్ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది. తాము బోణీ కొట్టడమే ప్రధానమనుకుంటే మూడు స్థానాల వరకు వచ్చాయంటే.. అది తమకు కలిసొచ్చే అంశమని, భవిష్యత్తులో రాష్ట్రంలో తాము పాతుకుపోవడానికి ఇదొక మంచి సంకేతమని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అయినా ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో ఈ నెల 4వ తేదీ తేలిపోతుందని, అంతవరకు ఎగ్జిట్‌పోల్స్‌ను ఆధారం చేసుకుని ఊహాగానాలు చేయడం సరి కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

మొత్తం 39 నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులు నిలిచినప్పటికీ ఈ సారి భారీ ఆశలు మాత్రం పెట్టుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం వెలువడిన ఎగ్జిట్‌పోల్స్‌లో అత్యధిక భాగం డీఎంకే కూటమికి 35కు పైగా స్థానాలు వస్తాయని ప్రకటించగా, అన్నాడీఎంకే కూటమికి 0-2, బీజేపీకి 2-3 సీట్లు వస్తాయని పేర్కొన్నాయి. ఇండియా టుడే సర్వే మాత్రం డీఎంకే కూటమికి 26-36, అన్నాడీఎంకే కూటమికి 6-8, బీజేపీ కూటమికి 1-3 స్థానాలు వచ్చే అవకాశముందని పేర్కొంది. దీంతో అన్నాడీఎంకే వర్గాలు తీవ్రంగా డీలాపడ్డాయి. తక్కువస్థానాలు వస్తాయని అనుకున్నప్పటికీ తమకు మరీ 0-2 స్థానాలు మాత్రమే వస్తాయని అత్యధిక ఎగ్జిట్‌పోల్స్ పేర్కొనడం పట్ల తీవ్ర నిరాశకు గురవుతున్నాయి.

ఓటు బ్యాంకు పదిలం


ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల వెల్లడిపై అన్నాడీఎంకేకు చెందిన ఓ యువనేత తమ ఓటు బ్యాంకు పదిలంగా వుందని వ్యాఖ్యానించారు. తమకు ఈ సారి కనీసం ఐదు స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గతంలో బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల తాము పూర్తిగా నష్టపోయామని, కానీ ఈ సారి ఐదు స్థానాలు పెరగడం వల్ల తమ నిర్ణయం సరైనదేనని వ్యాఖ్యానించారు. స్థానాలతో సంబంధం లేకుండా తమ ఓటు బ్యాంకు పెరిగిందని, ఇది వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు మంచి ఫలితాలు ఇస్తాయనడానికి సంకేతమని వ్యాఖ్యానించారు.

వాటిని విశ్వసించం: జయకుమార్

ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలపై అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ స్పందించారు. ఆ ఫలితాలను తాము విశ్వసించబోమని వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గతంలో జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు తమ పార్టీకి వ్యతిరేకంగా వచ్చాయని, అయితే పార్టీ భారీ మెజారిటీ సాధించి ప్రభుత్వం కూడా ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత హయాంలో చక్రం తిప్పిన అన్నాడీఎంకే.. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూడా రెండంకెల స్థానాలు గెలిచే అవకాశముందన్నారు. అందువల్ల కార్యకర్తలు నిరుత్సాహ పడరాదని విజ్ఞప్తి చేశారు.

దక్షిణ జిల్లాలకు చల్లని కబురు

● నేటినుంచి 14 జిల్లాల్లో వర్షం



చెన్నై నగరాన్ని కమ్మేసిన మబ్బు

ప్యారీస్, జూన్ 2: రాష్ట్రంలో ఎండలు మండుతున్న నేపథ్యంలో, దక్షిణ జిల్లాలకు చెన్నై వాతావరణ కేంద్రం చల్లని కబురు చెప్పింది. సోమవారం 14 జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతవరణ పరిశోధన కేంద్రం డైరెక్టర్ సెంతామరై కన్నన్ పేర్కొన్నారు. దక్షిణ జిల్లాల్లో నెలకొన్న ఆవర్తన ప్రభావం కారణంగా ఆదివారం నుంచి 5వ తేది వరకు రాష్ట్రంలోని పలు జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురుస్తుందని, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో కోస్తా తీరాల్లో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించారు. నీలగిరి, కోవై, తిరుప్పూర్, తేని, దిండుగల్, ఈరోడ్, సేలం, ధర్మపురి, తిరుపత్తూర్, కృష్ణగిరి, వేలూరు, తిరువణ్ణామలై, కళ్లకుర్చి, పెరంబలూరు జిల్లాల్లో శనివారం సాయంత్రం నుంచి ఉరుములు, పిడుగులతో వానలు కురిశాయి. గడిచిన 24 గంటల్లో ఉత్తర జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షం భారీగా కురిసింది. గరిష్టంగా సేలం జిల్లా ఏర్కాడులో 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. కృష్ణగిరి జిల్లా రాయకోట, నామక్కల్ జిల్లా రాశిపురం, ధర్మపురి జిల్లా పెన్నాగరం ప్రాంతంలో తలా 3 సెం.మీ వర్షపాతం నమోందైంది. కాగా, కన్నియాకుమారి సముద్రతీర ప్రాంతాలు, చుట్టుపక్కల ఉన్న దక్షిణ జిల్లా కోస్తా జిల్లా ప్రాంతాల్లో ఆదివారం నుంచి వచ్చే 4వ తేది వరకు 45 నుంచి 65 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని, ఈ రోజుల్లో జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

తిరుచ్చిలో కుండపోత...

తిరుచ్చి నగరంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో సుమారు గంటసేపు కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. శ్రీరంగం రాజగోపురం సమీపంలో 50 ఏళ్ల నాటి వేప చెట్టు వేళ్లతో సహా పెకలించుకొని కూలింది. దీంతో సమీపంలోని ఇళ్లు, దుకాణాలు దెబ్బతినగా, విద్యుత్ వైరు తెగిపడడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమ కనుమల ప్రాంతంలో కురుస్తున్న మోస్తరు వర్షాల కారణంగా కుత్రాలంలోని జలపాతాల్లో నీటి ప్రవాహం పెరగడంతో పర్యాటకులు ఉత్సాహంగా జలకాలాడుతున్నారు. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలో శనివారం సాయంత్రం 7 నుంచి అర్ధరాత్రి వరకు 13 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈరోడ్, ధర్మపురి, కోవై, నీలగిరి జిల్లాల్లో మూడు గంటల సేపు కురిసిన వర్షానికి ప్రధాన వీధులు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాల్లోకి వరద నీరు చేరడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరువళ్లూర్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుత్తణిలో వారం రోజుల అనంతరం చల్లటి వాతావరణం ఏర్పడింది. రాష్ట్రంలో 108 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రతలు నమోదైన ఈ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం సుమారు గంట పాటు కొనసాగింది. దీంతో కాశినాథపురం గ్రామంలోని చెట్టు వేళ్లతో సహా విద్యుత్ స్తంభంపై కూలింది. దీంతో ఆ ప్రాంతంలో సుమారు 3 గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిరుత్తణి-చెన్నై బైపాస్ రోడ్డులో భారీస్థాయిలో వరద నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అగూర్, మురుకంబట్టు, పట్టాభిరామపురం సహా పలు ప్రాంతాల్లో రోడ్లలో భారీగా వరద నీరు ప్రవహించింది. అకాలవర్షంతో తిరుత్తణి ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



తిరుత్తణి సమీపంలో కూలిన చెట్టు, చెన్నై బైపాస్ రోడ్డులో నిలిచిన వరద నీటిలో వాహనచోదకుల అగచాట్లు

భద్రతా వలయంలో

కౌంటింగ్ కేంద్రాలు

● లక్ష మందితో పహారా ● విధుల్లో 15 కంపెనీల పారామిలిటరీ బలగాలు



చెన్నైలోని కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రాధాకృష్ణన్

అడయార్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు రోజున లక్ష మంది పోలీసు బలగాలతో కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత కల్పించనున్నారు. ఇందులో 15 కంపెనీల పారామిలిటరీ బలగాలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్ ముగిసిన విషయం తెల్సిందే. అలాగే, డీఎంకే సిట్టింగ్ ఎమ్మెల్యే ఆకస్మిక మృతితో ఏర్పడిన విలవంగోడు అసెంబ్లీ స్థానానికి కూడా ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఓట్ల లెక్కింపు 4వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభంకానుంది. ఒక్కో లెక్కింపు కేంద్రం వద్ద వెయ్యి మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు. దీంతో కౌంటింగ్ కేంద్రాల వద్దే ఏకంగా 40 వేల మంది పోలీసులు పహారా కాయనున్నారు. ప్రతి లెక్కింపు కేంద్రం వద్ద సాయుధ దళాలు, స్పెషల్ బ్రాంచ్‌తో పాటు స్థానిక పోలీసులను మొహరించారు. అలాగే, 15 కంపెనీల సాయుధ పారామిలిటరీ బలగాలను కూడా భద్రత కోసం వినియోగిస్తున్నారు. తద్వారా ఓట్ల లెక్కింపు జరిగే మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటింగ్ కేంద్రాల వద్దే కాకుండా, ఇతర ప్రాంతాల్లో 60 వేల మంది పోలీసులను భద్రత కోసం వినియోగిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రాజకీయ పార్టీల కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలు, మసీదులు, ఆలయాలు, చర్చిలు, సమస్యాత్మక ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పోలీసు బందోబస్తు ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. చెన్నై నగరంలో ఓట్ల లెక్కింపు జరిగే అన్నా విశ్వవిద్యాలయం, క్వీన్ మేరీస్ కాలేజీ, లయోలా కాలేజీల్లోనే ఏకంగా మూడు వేల మందితో భద్రత కల్పిస్తున్నారు. ప్రతి కేంద్రంలో జాయింట్ కమిషనర్, ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు, పది మంది అసిస్టెంట్ కమిషనర్లు, కింది స్థాయి పోలీసులు ఉదయం 6 గంటల నుంచే బందోబస్తులో నిమగ్నంకానున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయి, ఫలితాల హడావుడి తగ్గేంత వరకు ఈ భద్రత కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

కౌంటింగ్ కోసం సమన్వయ అధికారుల నియామకం

పెరంబూర్, జూన్ 2: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా చెన్నై జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు ఇద్దరు చొప్పున సమన్వయ అధికారులను నియమించారు. ఆ ప్రకారం, ఉత్తర చెన్నై నియోజకవర్గానికి కార్తీ తాంజి బుద్ధపాటి (ఐఏఎస్), రాజేష్ కుమార్ (ఎస్‌జీఎస్), మధ్య చెన్నై నియోజకవర్గానికి జితేంద్ర గకుస్తే (ఎస్‌సీఎస్), డా.డి.సురేష్ (ఐఏఎస్), దక్షిణ చెన్నై నియోజకవర్గానికి ముద్దాడ రవిచంద్ర (ఐఏఎస్), మహమ్మద్ షఫీఖ్ చక్ (ఎస్‌పీఎస్)లు నియమితులయ్యారు.

మొదట తపాలా ఓట్ల లెక్కింపు

పెరంబూర్, జూన్ 2: చెన్నై జిల్లా పరిధిలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో తపాలా ఓట్లు మొదట లెక్కించనున్నట్లు జిల్లా ఎన్నికల కార్యాలయం ప్రకటించింది. చెన్నై జిల్లాలోని ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు రాణి మేరీ కళాశాల, మధ్య చెన్నై నియోకవర్గం లెక్కింపు లయోలా కళాశాల, దక్షిణ చెన్నై నియోజకవర్గం ఓట్ల లెక్కింపు అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం జరుగనుంది. ఓట్ల లెక్కింపు విధుల్లో ఉత్తర చెన్నైలో 357 మంది, దక్షిణ చెన్నైలో 374 మంది, మధ్య చెన్నైలో 380 మంది, 322 మంది ఆఫీసు అసిస్టెంట్లు మొత్తం 1,433 మంది ఉద్యోగులు, అధికారులు నియమితులవుతున్నారు. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం మూడు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో శాసనసభ నియోజకవర్గాల వారీగా 14 టేబుళ్లు ఏర్పాటుచేశారు. షోలింగనల్లూర్ శాసనసభ నియోజకవర్గంలో మాత్రం 30 టేబుళ్లు ఏర్పాటయ్యాయి. తపాలా ఓట్ల లెక్కింపుకు 29 మంది అదనపు సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించారు. మూడు లెక్కింపు కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్ స్వయంగా పరిశీలించారు.

ఈ నేపథ్యంలో, తపాలా ఓట్లు చివరలో లెక్కిస్తామని జిల్లా ఎన్నికల అధికారి రాధాకృష్ణన్ తెలిపినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో, దీనికి వ్యతిరేకం తెలిపిన డీఎంకే ప్రిసీడియం చైర్మెన్ ఆర్‌ఎస్ భారతి, మొదట తపాలా ఓట్లు లెక్కించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహుకు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో, జిల్లా ఎన్నికల కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో.. ఎన్నికల నిబంధనల ప్రకారం, రిటర్నింగ్ అధికారికి వచ్చిన అన్ని తపాలా ఓట్లు మొదట లెక్కించనున్నామని తెలిపారు. 30 నిముషాల అనంతరం ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఎన్నికల కార్యాలయం తెలిపింది.


ప్రజ్ఞానందకు సీఎం విషెస్

అడయార్, జూన్ 2: నార్వే చెస్ పోటీల్లో అద్భుత ఆటతీరు కనపరుస్తున్న రాష్ట్రానికి చెందిన చదరంగం ఆటగాడు ప్రజ్ఞానంద కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా ఇప్పటివరకు జరిగిన ఆటలో వరల్డ్ నెంబర్ 3 ఆటగాడు మైఖేల్ కార్ల్‌సను ఓడించిన ప్రజ్ఞానంద వరల్డ్ టాప్-5 ఆటగాడు బేబీ యానోను క్లాసిక్ చెస్ పోటీల్లో చిత్తు చేశాడు. దీంతో ప్రపంచ చదరంగ క్రీడాకారుల జాబితాలో టాప్-10లోకి ప్రజ్ఞానంద ప్రవేశించాడు. ఈ విషయం తెలుసుకున్న సీఎం స్టాలిన్ ... ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు.

35 శాతం పెరిగిన

విద్యుత్ వినియోగం

● బహుళ అంతస్తులతో తగ్గిన గ్రీన్ జోన్ ● భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు!



చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో రోజువారీ విద్యుత్ వినియోగం ఏకంగా 35 శాతం మేర పెరిగింది. అదేసమయంలో నగరంలో బహుళంతస్తుల నిర్మాణాలు పెరిగిపోవడంతో గ్రీన్ జోన్ విస్తీర్ణం తగ్గిపోయింది. ఈ వేసవిలో రాష్ట్ర వ్యాప్తంగా భానుడు ప్రతాపానికి అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఈ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత నెల 27 నుంచి నగరంలో నగరంలో ఉష్ణతాపం ఒక్కసారిగా పెరిగిపోయింది. ప్రతి రోజూ కనిష్టంగా 35 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఒక్కసారిగా ఉక్కపోత పెరిగిపోవడంతో నగర వాసులు తీవ్ర అవస్థలు పడి, ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లను వినియోగించారు. నిజానికి రాష్ట్రంలో వేసవికాలం ప్రారంభమైన తర్వాత గత నెల 17వ తేదీన నగరంలో విద్యుత్ వినియోగం 3,519 మెగావాట్లుండగా, ఇపుడు అది ఏకంగా 4,769 మెగావాట్లకు పెరిగింది. ఇది సరికొత్త రికార్డుగా విద్యుత్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ విద్యుత్ వినియోగం ఏకంగా 35 శాతం మేర పెరిగిందని వారు తెలిపారు. గత నెల 31వ తేదీ గణాంకాల మేరకు నగరంలో విద్యుత్ వినియోగం పది కోట్ల యూనిట్లు దాటిపోయింది. అయితే, చెన్నై నగరంలో ఉష్ణోగ్రత పెరగడానికి కారణం అధిక సంఖ్యలో నిర్మించిన బహుళంతస్తుల భవనాలేనని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాటి కారణంగా నగరంలో గ్రీన్ ఏరియా పరిధి తగ్గిపోయింది. 2003లో బహుళ అంతస్తుల నిర్మాణాల శాతం 30.7 శాతం ఉంటే 2023 నాటికి అది 73.5 శాతానికి పెరిగింది. గత 20 యేళ్ళ కాలంలో బహుళ అంతస్తుల భవనాల విస్తీర్ణం 42.8 శాతానికి పెరిగింది. అదేసమయంలో చెన్నై నగరంలో హరిత ఏరియా (గ్రీన్ జోన్) విస్తీర్ణం 34 శాతం నుంచి 20.3 శాతానికి తగ్గిపోయింది. ఈ పరిస్థితి ప్రమాద ఘంటికలు మోగిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని కారణంగా చెన్నై నగరంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నగరంలో వచ్చే రెండు రోజుల్లో ఎండ వేడి తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయంపై ఐఎండీ అధికారి ఒకరు మాట్లాడుతూ.. చెన్నైతో పాటు శివారు ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, గరిష్టంగా 102 నుంచి 100 డిగ్రీలు, కనిష్టంగా 84 నుంచి 86 డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

తమిళుడు దేశానికి నాయకుడు కాకూడదా?

● కమల హాసన్



అడయార్, జూన్ 2: ఒక తమిళుడు దేశానికి ఎందుకు నేతృత్వం వహించకూడదన్న భావన తనకుందని విశ్వనటుడు కమల్ హాసన్ అన్నారు. ఆయన నటించిన 'ఇండియన్-2' చిత్రం ఆడియో రిలీజ్ శనివారం రాత్రి నగరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేను ఒక తమిళుడిని. నేను ఒక భారతీయుడిని. ఇదే నా గుర్తింపు. ఇక్కడ విభజనతో ఆట్లాడుదామని భావిస్తే అది జరగని పని. ఈ గడ్డపై అడుగుపెట్టిన ప్రతి ఒక్కరినీ పెంచి పోషించే మట్టి ఇది. తమిళుడికి ఎల్లవేళలా శాంతిని కాపాడాలని తెలుసు. ఎక్కడ ఉండాలో కూడా తెలుసు. ఒక తమిళుడు దేశానికి ఎందుకు నేతృత్వం వహించకూడదన్నదే నా భావన' అన్నారు. అద్భుత సృష్టికి మరో ఉదాహరణే శంకర్ అని, మంత్రి ఉదయనిధి తనకు అండగా నిలిచారని, ఆయనకు తాను అండగా ఉంటానని కమల్ ప్రకటించారు.

సమాచార ధ్వని

మహిళలకు ఉపాధి శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 2: నగరంలో పది రోజులు మహిళలకు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర మహిళా ప్రోత్సాహిక పారిశ్రామికవేత్తల సంక్షేమ సంఘం తెలిపింది. శిక్షణకు కావాల్సిన మూల వస్తువులు ఏమిటి, అవి ఎక్కడ లభిస్తాయి, ఎలా డిజైన్ చేయాలి వంటి వాటిని వివరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు forn.wewatn.com అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలని, వివరాలకు 9361086551 నెంబరు సంప్రదించాలని తెలిపారు.

ఏడు లక్షల మంది ఊటీ సందర్శన

ఐసిఎఫ్, జూన్ 2: ఊటీని ఏడు లక్షల మంది పర్యాటకులు సందర్శించారని, గత ఏడాదికన్నా ఈ సంఖ్య 1.5 లక్షలు తక్కువని అధికారులు తెలిపారు. వేసవి సీజన్‌కు నీలగిరి జిల్లాకు రెండు నెలల్లో 7,03,362 మంది పర్యాటకులు వచ్చారని, పుష్ప ప్రదర్శన జరిగిన 17 రోజుల్లో 2.41 లక్షల మంది తిలకించారని తెలిపారు. గత ఏడాది 8,61,214 మంది సందర్శించారని తెలిపారు. గత ఏడాది కన్నా ఈసారి 1,57,852 మంది తగ్గారని అధికారులు తెలిపారు.

10 వరకు స్పైస్ జెట్ విమానాల రద్దు

పెరంబూర్, జూన్ 2: స్పైస్ జెట్ విమానాలు శనివారం నుంచి 10వ తేది వరకు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్పైస్ జెట్ సంస్థ చెన్నై నుంచి హైదరాబాద్, షిర్డీ, గోవా, అండమాన్ సహా పలు నగరాలకు రోజుకు 10 విమానాలు నడుపుతోంది. ఈ నేపథ్యంలో, శనివారం నుంచి అన్ని నగరాలకు వెళ్లే విమానాలను ఆ సంస్థ రద్దు చేసింది. ఈ కారణంగా సుమారు 120 విమానాల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నిర్వహణ కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ప్రకటన విడుదల చేసింది.

హాస్టల్ భోజనం చేసిన 80 మందికి అస్వస్థత

పెరంబూర్, జూన్ 2: ఈరోడ్ జిల్లా సెంగుందర్ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో శనివారం రాత్రి భోజనం చేసిన 80 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ నిర్వాహకులు విద్యార్థులను పెరుందురై ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆహార భద్రతా శాఖ అధికారులు హాస్టల్ చేరుకొని, ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి పరిశోధన కోసం ల్యాబ్‌కు పంపించి విచారణ చేపట్టారు.

పోలీసుల ఆధ్వర్యంలో కరాటే శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 2: పోలీసుల ఆధ్వర్యంలో కరాటే శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక పెరుంబాక్కంలో 23 వేలకు పైగా గృహాలున్నాయి. ఇక్కడున్న విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇచ్చేందుకు పెరుంబాక్కం పోలీస్‌స్టేషన్ ముందుకొచ్చింది. కరాటేలో జాతీయస్థాయిలో బ్లాక్ బెల్ట్ సాధించిన హెడ్ కానిస్టేబుల్ కామరాజర్ శిక్షణ ఇవ్వనున్నారు. ఆత్మరక్షణ కోసం, జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో జరిగే పోటీలకు సన్నద్ధమయ్యేలా ప్రతి శని, ఆదివారాల్లో ఈ శిక్షణ ఇవ్వనున్నామని, ఆసక్తి ఉన్న వారు 9499003079 అనే నెంబరు సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

10 నుంచి పశువులకు మీజిల్స్ టీకా

ఐసిఎఫ్, జూన్ 2: పశువులకు ఈ నెల 10వ తేది నుంచి మీజిల్స్ టీకా వేయనున్నట్లు అధికారులు తెలిపారు. పశువుల నోరు, కాళ్లకు సోకే వ్యాధితో పాడిపశువుల్లో పాల ఉత్పత్తి తగ్గడం, మరణించడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఈవ్యాధి వ్యాప్తి చెందకుండా చెన్నై జిల్లాలో 30,100 పశువులకు 10వ తేది నుంచి టీకాలు వేయనున్నామని, పశువుల యజమానులు ప్రత్యేక శిబిరాలకు వాటిని తరలించి టీకాలు వేయించాలని అధికారులు సూచించారు.

తిరువణ్ణామలైలో మలేసియా భక్తుడి మృతి

ప్యారీస్, జూన్ 2: తిరువణ్ణామలైలో అన్నామలై స్వామివారి దర్శనానికి వచ్చిన మలేసియా భక్తుడు లాడ్జిలో మృతిచెందడంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌కు చెందిన అశోక్‌కుమార్ (46) ఇటీవల తిరువణ్ణామలై సందర్శనకు వచ్చారు. ఆయన చిన్నకడై వీధిలో ఉన్న లాడ్జిలో బసచేశారు. శనివారం ఉదయం అశోక్‌కుమార్ లాడ్జి మెట్లపై శవమై పడి ఉండడాన్ని సిబ్బంది గుర్తించారు. లాడ్జీ మేనేజర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలల్లోనే విద్యార్థులకు బ్యాంక్ ఖాతా

పెరంబూర్, జూన్ 2: చదువుతున్న పాఠశాలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు బ్యాంక్ ఖాతా ప్రారంభించేలా చర్యలకు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. 1 నుంచి ప్లస్ టూ వరకు విద్యార్థులు బడి మానేయకుండా రాష్ట్రప్రభుత్వం ఉపకార వేతనాలు, గ్రాంట్లు అందజేస్తోంది. ఈ ప్రోత్సాహకాలు విద్యార్థులకు సమయానికి అందేలా, వారి పేరుతో బ్యాంక్ విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లోనే బ్యాంక్ ఖాతా ప్రారంభింపజేసేలా ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

10లోగా అదనపు ఉపాధ్యాయుల బదిలీలు

ఐసిఎఫ్, జూన్ 2: ఎయిడెడ్ పాఠశాలల్లో ఉన్న 5,546 మంది అదనపు ఉపాధ్యాయులను ఈ నెల 10వ తేదిలోగా ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రాథమిక పాఠశాలల్లో 1:30 నిష్పత్తిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య ఉండాలి. అయితే ఎయిడెడ్ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా, ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉంది. దీనికి సంబంధించి విద్యాశాఖ వివరాలు సేకరించగా, రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ పాఠశాలల్లో 5,546 మంది ఉపాధ్యాయులు అదనంగా ఉన్నట్లు తెలిసింది.వారిని ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు ఈనెల 10వ తేదిలోగా బదిలీ చేయాలని జిల్లా ప్రాథమిక విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీచేసింది.

వేళచ్చేరిలో బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

ప్యారీస్, జూన్ 2: స్థానిక వేళచ్చేరి ప్రాంతంలో ఆదివారం బాలిక వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు, వరుడు, బంధువులను విచారిస్తున్నారు. వేళచ్చేరి నియోజకవర్గ పరిధిలోని ఎళిల్‌నగర్‌కు చెందిన శేఖర్ (30)కు అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలికకు వివాహం జరిపించేందుకు రెండు కుటుంబాల పెద్దలు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం వీరి వివాహం ఓ కమ్యూనిటీ హాలులో జరుగుతుందని బాలల సంక్షేమ భద్రతా విభాగం అధికారులకు సమాచారం అందింది. అక్కడకు పోలీసులతో చేరుకున్న అధికారులు వివాహాన్ని అడ్డుకొని, ఆ బాలికను విడిపించి బాల సంరక్షణ కేంద్రానికి పంపించారు. దీనిపై వరుడు శేఖర్, రెండు కుటుంబాల సభ్యుల వద్ద విచారణ జరుపుతున్నారు.

విమానాశ్రయంతో పాటు మూడు ప్రాంతాలకు బాంబు బెదిరింపులు

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయంతో పాటు మూడు ప్రాంతాలకు గుర్తు తెలియని వ్యక్తులు బాంబు బెదిరింపులు చేశారు. ఈ మేరకు నగర పోలీసులకు ఆకాశరామన్న పేరుతో బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. చెన్నై ఎయిర్‌పోర్టు, నందనం వైఎంసీఏ మైదానం, ఎస్ఎస్‌సీ బోస్ రోడ్డులో ఉన్న వైఎంసీఏ భవనాలను బాంబులతో పేల్చివేస్తామని నగర పోలీస్ కంట్రోల్ రూంకు ఆదివారం ఉదయం ఒక ఈమెయిల్ వచ్చింది. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ఈ మూడు ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లేదా బాంబులు బయటపడలేదు. దీంతో ఈ బెదిరింపులు ఉత్తుత్తివేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అదేసమయంలో ఈ బాంబు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.


చెన్నై విమానాశ్రయం

శాసనసభ ఎన్నికల్లోనూ బీజేపీతో కూటమి

● టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్

పెరంబూర్, జూన్ 2: రాష్ట్రంలో 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో తమతో పాటు అనేక పార్టీలు చేరనున్నాయని, మళ్లీ కామరాజర్ పాలన అందించేలా బీజేపీ కూటమి ఉంటుందని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ తెలిపారు. శివగంగ జిల్లా కారైక్కుడిలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... ఎన్నికల సర్వే ఫలితాలు మించి బీజేపీ కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రప్రజలు కూడా బీజేపీ కూటమిని ఆదరించారని, ఇక్కడ కూడా పలు స్థానాల్లో కూటమి గెలిచే అవకాశముందన్నారు. దేశ భవిష్యత్తు, అభివృద్ధి, సంక్షేమం దృష్ట్యా బీజేపీతో జతకట్టామని జీకే వాసన్ తెలిపారు.

ఇజ్రాయిల్ సైనిక ఆగడాలను నిరసిస్తూ సీపీఎం ధర్నా


ఎంపీ నటరాజన్ ఆధ్వర్యంలో ఆందోళన

పెరంబూర్, జూన్ 2: ఇజ్రాయిల్ సైనికుల ఆగడాలను ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కోవై దక్షిణ జిల్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కోవై సీపీఎం ఎంపీ పీఆర్ నటరాజన్ నేతృత్వంలో సాగిన ఈ ఆందోళనలో... పాలస్తీనాలో మారణహోమం సాగిస్తున్న ఇజ్రాయిల్ సైన్యానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. గత ఏడాది అక్టోబరు నుంచి గాజాలో ఇజ్రాయిల్ సైన్యం నరమేధానికి పాల్పడుతోంది. ఈ ఆపరేషన్ వల్ల సుమారు 36 వేల మంది పాలస్తీనీయులు మృతిచెందారు. గత నెల 26వ తేది సరిహద్దు పట్టణమైన రఫాలోని శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన బాంబు దాడిలో 45 మంది మృత్యువాతపడ్డారు. పాలస్తీనా భూభాగాల్లో వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలి, ఇజ్రాయిల్‌కు ఆయుధాల ఎగుమతులు తక్షణం నిలిపివేయాలి, ఐక్యరాజ్యసమితి కౌన్సిల్ ద్వారా పాలస్తీనా స్వతంత్ర రాజ్యం ఏర్పాటుచేయాలి అంటూ ఆందోళనలో ఎంపీ నటరాజన్ డిమాండ్ చేశారు.

పర్యాటక ప్రాంతాల్లో పెరిగిన రద్దీ

అడయార్, జూన్ 2: రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో విపరీతంగా పర్యాటకుల రద్దీ పెరిగిపోయింది. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 6వ తేదీన పాఠశాలలను పునఃప్రారంభించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. కానీ, ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో బడులను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. దీంతో పర్యాటక ప్రాంతాల్లో రద్దీ అనూహ్యంగా పెరిగింది. వరుస సెలవుల కారణంగా అనేక మంది పర్యాటక ప్రాంతాలకు క్యూ కట్టారు. సాధారణంగా వారాంతపు రోజుల్లో ఊటీ, కొడైక్కెనాల్, ఏర్కాడు, హొగెనేకల్ వంటి ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. అయితే, ఇపుడు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు వేసవి సెలవులను ఈ నెల 10వ తేదీ వరకు పొడగించడంతో పాటు వరుస సెలవులు వచ్చాయి. ఈ కారణంగానే పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ పెరగడానికి ప్రధాన కారణంగా ఉంది.

కాంగ్రెస్ నేత హత్య కేసు...

1500 సాక్షుల వాంగ్మూలం పరిశీలన

అడయార్, జూన్ 2: తిరునెల్వేలి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత కేపీకే జయకుమార్ అనుమానాస్పద మృతి కేసు విచారణను సీబీసీఐడీ అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో రాజకీయ నేతలు, పారిశ్రామిక, వ్యాపారవేత్తల ఇలా దాదాపు 1500 మంది నుంచి సేకరించిన వాంగ్మూలాలను సీబీసీఐడీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సీబీసీఐడీ ఇన్‌స్పెక్టర్ ఉలగరాణి సారథ్యంలోని ప్రత్యేక బృందం సాక్షుల వాంగ్మూలాను అధ్యయనం చేస్తూ, అనుమానాస్పదంగా భావించిన వారి నుంచి మరిన్ని వివరాలు సేకరించేందుకు వీలుగా విచారణకు హాజరుకావాలంటూ సమన్లు జారీ చేస్తున్నారు.

కోయంబేడు మార్కెట్లో మరో 200 సీసీ కెమెరాల ఏర్పాటు

పెరంబూర్, జూన్ 2: స్థానిక కోయంబేడు మార్కెట్లో మరో 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్కెట్ ప్రాంగణంలో పూలు, పండ్లు, కూరగాయలు, చిల్లర వ్యాపారం మొత్తం 3,000లకు పైగా దుకాణాలున్నాయి. ఈ మార్కెట్‌కు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూరగాయలు, పండ్లు తదితరాలతో పెద్దసంఖ్యలో రాత్రి వేళల్లో వాహనాలు వస్తుంటాయి. ఈ క్రమంలో, ఈ మార్కెట్లో రౌడీల ఆగడాలు, చోరీలు జరుగుతున్నట్లు వ్యాపారుల ఫిర్యాదుపై స్పందించిన అధికారులు, ఇప్పటికే మార్కెట్లోని పలు ప్రాంతాల్లో 200 కెమెరాలు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. అయినా, నేరాలు, రౌడీల ఆగడాలు అదుపులోకి రాకపోవడంపై స్పందించిన అధికారులు, పార్కింగ్‌సహా పలు ప్రాంతాల్లో మరో 200సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నామని అధికారులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో 30.6 కిలోల గంజాయి స్వాధీనం

● హిజ్రా, నలుగురు మహిళల సహా 9 మంది అరెస్ట్

పెరంబూర్, జూన్ 2: స్థానిక అన్నానగర్, అరుంబాక్కం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు 30.6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని 9 మందిని అరెస్ట్ చేశారు. సెంబియం కరుమారియమ్మన్ ఆలయ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు హిజ్రా అహల్య, ఆదిలక్ష్మి, భువనేశ్వరితదితరులను అరెస్ట్ చేసి, వారి నుంచి 20.1 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, అరుంబాక్కం అంబేడ్కర్ మైదానం సమీపంలో కృష్ణమూర్తి , రమేష్, గీత తదితరులను అరెస్ట్ చేసి, వారి నుంచి 6.3 కిలోల గంజాయి, ఒక ద్విచక్రవాహనం, ఒక తూకం మెషీన్ స్వాధీనం చేసుకున్నారు. పుళల్ అన్నానగర్ రెండవ వీధిలో తనిఖీలు చేసిన పోలీసులు రాజ్, పొన్నమ్మలను అరెస్ట్ చేసి, వారి నుంచి 3 కిలోల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తిరువాన్మియూర్ రంగనాధపురంలో అయ్యప్పన్‌ను అరెస్ట్ చేసి 1.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు శాఖ ప్రకటన విడుదల చేసింది.

విమానాల రద్దు ... ప్రయాణికుల అవస్థలు

అడయార్, జూన్ 2: చెన్నై విమానాశ్రయం నుంచి షిర్డి, అండమాన్ వెళ్లాల్సిన విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. శనివారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు స్పైస్ జెట్ అన్ని విమానాలను రద్దు చేసింది. వాటిలో ఆదివారం షిర్డి, అండమాన్ వెళ్ళాల్సిన విమానాలు కూడా ఉన్నాయి. అయితే, ఈ విమానాల్లో వెళ్ళాల్సిన ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తర్వాత ఈ నెల 10 వరకు విమానాలు రద్దు చేసినట్టు తెలిసింది. దీంతో ఈ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోలింగ్ ఏజెంట్ల భోజన ఖర్చు రూ.375

● ఈసీకి వెల్లడించిన అభ్యర్థులు

అడయార్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపు ఈ నెల 4, మంగళవారం చేపట్టనున్నారు. ఆ రోజు లెక్కింపు కేంద్రాల్లో ఆయా పార్టీల తరపున హాజరయ్యే కౌంటింగ్ ఏజెంట్లకు ఆహారం కోసి రూ.375 ఖర్చు చేయనున్నట్టు ఎన్నికల సంఘానికి ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు ఇచ్చారు. ఉదయం అల్పాహారంగా ఇండ్లీ, పొంగల్, మధ్యాహ్నం భోజనం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏజెంట్లకు మూడు పూటలా భోజన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. 4వ తేదీ ఉదయం 6.30 గంటలకే అల్పాహారం ఇస్తారు. ఇందులో ఒక ఇడ్లీ, పొంగల్, స్వీట్, ఊతప్పం, సాంబార్, చట్నీ, టీ, వాటర్ బాటిల్ ఇస్తారు. ఈ టిఫన్ ధర రూ.160గా చూపించారు. అలాగే, మధ్యాహ్నం 11.30 గంటలకు తేనీరు, బిస్కెట్లు అందజేస్తారు. దీని ధర రూ.25గా నిర్ణయించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు లంచ్ అందజేస్తారు. ఇందులో స్వీట్, చపాతి, సాంబార్ రైస్, విజిటేబుల్ బిర్యానీ, పెరుగన్నం, ఊరగాయి, వాటర్ బాటిల్ అందజేస్తారు. ఈ భోజనం ధర రూ.160గా పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు టీ, స్నాక్స్ అందజేస్తారు. వీటి ధర రూ.30. మొత్తంగా ఈ భోజన ఖర్చు రూ.375గా ఎన్నికల సంఘానికి అభ్యర్థులు లెక్కలు సమర్పించారు. లెక్కింపు కేంద్రాల్లో నియమించే ఏజెంట్లకు అయ్యే ఖర్చును అభ్యర్థులు ఎన్నికల సంఘానికి చెల్లించి, టోకెన్లను పొందారు.

ఆస్పత్రి నుంచి వైగో డిశ్చార్జి



పెరంబూర్, జూన్ 2: భుజం ఎముక విరగడంతో అపోలో వైద్యశాలలో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో చికిత్స పొందుతున్నారు. అక్కడ ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించిన నేపథ్యంలో, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉంది. శస్త్రచికిత్స అనంతరం ఆస్పత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయనను పరామర్శించారు. ఏడు రోజుల వైద్యుల పర్యవేక్షణ అనంతరం ఆదివారం సాయంత్రం వైగో డిశ్చార్జి అయ్యారు. అనంతరం పది రోజులు ఆయన వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటారని, ఆయనను కలుసుకొనేందుకు కార్యకర్తలు రావద్దని పార్టీ పత్రికా ప్రకటన విడుదల చేసింది.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



పెరంబూర్, జూన్ 2: మనప్పారై సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. కాంచీపురం జిల్లా పూందమల్లికి చెందిన శశిధరన్ (41)-రాజశ్రీ (40) దంపతులకు రుషిత (13) అనే కుమార్తె ఉంది. వీరు పళనికి వెళ్లేందుకు కారులో బయల్దేరారు. శశిధరన్ నడుపుతున్న కారు ఆదివారం ఉదయం తిరుచ్చి-దిండుగల్ మార్గంలో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జుకాగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. రాజశ్రీ, రుషితలను చుట్టుపక్కల వారు రక్షించి మనప్పారై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారు శిధిలాల్లో చిక్కుకున్న శశిధరన్‌ను రక్షించేందుకు సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని శశిధరన్‌కు గ్లూకోజ్ ఎక్కిస్తూ అత్యవసర చికిత్స చేపట్టారు. క్రేన్ ద్వారా గుంత నుంచి కారును వెలికి తీసిన అనంతరం శశిధరన్‌ను రక్షించి మనప్పారై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలో అతను మృతిచెందినట్లు తెలిపారు. కాగా, అప్పటికే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శశిధరన్ భార్య రాజశ్రీ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఏనుగు దాడిలో విద్యార్థి మృతి


ముఖేష్(ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూన్ 2: ఏనుగు దాడిలో కళాశాల విద్యార్థి మృతిచెందిన ఘటన కోయంబత్తూర్ జిల్లాలో చోటుచేసుకుంది. మానాంపల్లి అటవీ రేంజ్ పరిధిలోని పుదుక్కాడు ఎస్టేట్ ప్రాంతానికి చెందిన సురేష్ కుమారుడు ముఖేష్ (18) ఓ ప్రైవేటు కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పుదుక్కాడు ఎస్టేట్ నుంచి సోలైయారు నదికి వెళ్లే దారిలో ద్విచక్రవాహనంపై వస్తుండగా, రోడ్డు పక్కనే ఉన్న తేయాకు తోట నుంచి హఠాత్తుగా వచ్చిన అడవి ఏనుగు మోటార్‌సైకిల్‌తో పాటు ముఖేష్‌ను తొండంతో చుట్టి విసిరేసింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముఖేష్‌ను చుట్టుపక్కల వారు వాల్పారై ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మామను బండరాయితో కొట్టి చంపిన అల్లుడు

అడయార్, జూన్ 2: నగర శివారు ప్రాంతమైన మధురవాయల్ ప్రాంతంలో ఓ ఆలయంలో నిద్రిస్తున్న మామను అల్లుడు బండరాయితో కొట్టి చంపేశాడు. పోలీసుల కథనం మేరకు.. మధురవాయల్ పిళ్ళైయార్ వీధికి చెందిన కన్నన్ (65) అనే వ్యక్తికి లక్ష్మి అనే కుమార్తె ఉంది. ఈమె భర్త మహేశ్వరన్. రోజువారీ కూలీ. వీరికి ఇద్దరు పిల్లలు, వీరంతా కలిసి ఉమ్మడిగా ఉన్నారు. తమ ఇంటి సమీపంలోని ఆలయం వద్ద కన్నన్ ప్రతి రోజూ నిద్రపోతుంటాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదీ కోయంబేడు పోలీసులు రాత్రిపూట పెట్రోలింగ్‌కు అటు వైపు వెళ్ళారు. ఆ సమయంలో కన్నన్ అపస్మారకస్థితిలో పడివుండటాన్ని గమనించారు. కన్నన్ తలపై బలమైన దెబ్బతగిలివుంది. వెంటనే కన్నన్‌ను కేఎంసీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మద్యం సేవించడంతో అల్లుడు మహేశ్వరన్‌ను కన్నన్ మందలించాడు. దీన్ని జీర్ణించుకోలేక మామను బండరాయితో కొట్టి చంపినట్టు నిందితుడు అంగీకరించాడు. దీంతో మహేశ్వరన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

అశ్లీల వీడియో పేరుతో యువతికి బెదిరింపులు

అడయార్, జూన్ 2: అశ్లీల వీడియో పేరుతో ఒక యువతికి లక్ష రూపాయలు ఇవ్వాలంటూ బెదిరించిన మోసగాడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మన్నార్‌కుడికి చెందిన 23 యేళ్ళ యువతి చెన్నైలోని హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుంది. ఆ యువతికి ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, నీ అశ్లీల వీడియో తన దగ్గర ఉందని, అది సోషల్ మీడియాలో విడుదల చేయకుండా ఉండాలంటే లక్ష రూపాయలు ఇవ్వాలంటూ బెదిరించాడు. దీంతో భయపడిపోయిన ఆ యువతి తన వద్ద అంత డబ్బు లేదని చెప్పడంతో రూ.9 వేలు అయినా ఇవ్వాలని బెదిరించాడు. చివరకు ఆ యువతి రూ.6500లు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేసింది. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ప్రకృతి విపత్తులను అడ్డుకోవడంపై అవగాహన

పెరంబూర్, జూన్ 2: విల్లుపురం సమీపం కారై. పెరుంబాక్కం గ్రామాల్లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో, జలాశయాల సమీపంలో ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక శాఖ అధికారి శివశంకరన్ నేతృత్వంలో, నదిలో వరద ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రవాహంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యే వారిని రక్షించడం తదితరాలు వివరించడంతో పాటు మాక్ డ్రిల్ చేసి చూపారు. లైఫ్ జాకెట్ల వినియోగం, రక్షించేందుకు అవసరమైన పరికరాలపై యువకులకు సిబ్బంది తెలియజేశారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌంటింగ్ కేంద్రాల భద్రతలో నిర్లక్ష్యం

● ఈరోడ్‌లో ఐదుగురు పోలీసు అధికారుల బదిలీ

ప్యారీస్, జూన్ 2: కౌంటింగ్ కేంద్రాల వద్ద విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు మహిళా ఎస్ఐలుసహా ఐదుగురు పోలీసులను రిజర్వ్‌డ్ పోలీసు విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈరోడ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఈవీఎం, వీవీ పాట్‌లను ఈరోడ్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో భద్రపరిచారు. అక్కడ నాలుగంచెల పోలీసు భద్రత కల్పించారు. ఇందులో పోలీసులకు షిఫ్టు పద్ధతిలో డ్యూటీ కేటాయించారు. ఈరోడ్ ఎస్పీ జవహర్ అప్పుడప్పుడూ పర్యవేక్షిస్తున్నారు. ఆ మేరకు ఇటీవల ఆయన ఈ కేంద్రాన్ని పరిశీలించగా, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురు పోలీసు అధికారులను మందలించారు. అంతేకాకుండా ఆ ఐదుగురిని ఈరోడ్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ విభాగానికి బదిలీ చేశారు.

బీజేపీ అధికారం చేపట్టాలంటూ ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో కార్యకర్తలు

వేలూరు, జూన్ 2: లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ విజయం సాధించి మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకావాలని కోరుతూ బీజేపీ కూటమి పార్టీల కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున పోటీచేసిన ఏసీ షణ్ముగం గెలవాలని కూడా కేవీ కుప్పం బీజేపీ కార్యకర్తలు లత్తేరి శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కేవీ కుప్పం బీజేపీ అధ్యక్షుడు జయప్రకాశ్, జిల్లా కార్యకర్తల కమిటీ అధ్యక్షుడు దేవరాజ్, నిర్వాహకులు శేఖర్, లక్ష్మీనారాయణన్, వెంకటేశన్, మధురపాండ్యన్ సహా కార్యకర్తలు పాల్గొన్నారు.

అపోలో డయాగ్నోటిక్ కేంద్రం ప్రారంభం


ప్రసంగిస్తున్న డా.శంకర్, నవీన్ తదితరులు

వేలూరు, జూన్ 2: స్థానిక కాట్పాడి తాలూకా తిరునగర్, కాట్పాడి గాంధీ నగర్ పాండిచ్చేరి-చిత్తూరు జాతీయ రహదారిలో ఉన్న ఇందిరా నర్సింగ్ హోంలో అపోలో డయాగ్నోటిక్ కేంద్రం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆస్పత్రి స్థాపకులు డాక్టర్ శంకర్, అపోలో ఆస్పత్రి ప్రధాన నిర్వాహణాధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించేలా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు డా.శంకర్ విలేఖరుల సమావేశంలో తెలిపారు.

బాధితులకు కలెక్టర్ పరామర్శ



వేలూరు, జూన్ 2: పేర్నాంబట్టు తాలూకా సెంగత్తూర్ గ్రామస్తులు కలుషిత నీరు తాగడంతో వాంతులు, విరోచనాలు బారిన పడి గుడియాత్తం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి, వారిని అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట గుడియాత్తం సబ్ కలెక్టర్ శుభలక్ష్మి, ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ బాలచందర్, గుడియాత్తం తహసీల్దార్ మనోహరన్ తదితరులున్నారు.

124 ఏళ్లలో ఏడవ సారి...!

మే నెలల్లో అధిక వర్షపాతం

పెరంబూర్, జూన్ 2: రాష్ట్రంలో 124 ఏళ్లలో ఏడో సారి ఈ ఏడాది మే నెలల్లో అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచే పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదుకావడంతో పాటు వేడిగాలుల ప్రభావం కూడా అధికంగా ఉంది. అనంతరం మే 4 నుంచి అగ్ని నక్షత్రం ప్రారంభమైన నేపథ్యంలో, ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని భావించిన తరుణంలో, అందుకు బదులుగా ఉపరితల ఆవర్తన ద్రోణి, 'రిమెల్' తుఫాను కారణంగా మే నెలంతా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిశాయి. ముఖ్యంగా, దక్షిణ జిల్లాలు, పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాల్లో 200 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది అధిక వర్షపాతం అయింది. రాష్ట్రంలో 124 ఏళ్లలో 7వ సారి ఈ ఏడాది మే నెలల్లో అధిక వర్షపాతం నమోదైంది. అంతకు ముందు అధికంగా 1943 మే నెలలో 205.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, 1930లో 163.7, 1972లో 149.4 మి.మీ, 1955లో 148 మి.మీ, 1995లో 142.5 మి.మీ, 2014లో 139.3 మి.మీ, ఈ ఏడాది (2024) మే నెలలో 138.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అదే సమయంలో రాష్ట్రంలో వేసవి వర్షాలు ప్రస్తుత ఏడాది మే నెలలో సాధారణం కన్నా 19 శాతం అధికంగా కురిశాయి.

మోదీ విజయాల గురించి ప్రచారం చేయలేదేం?

బీజేపీని ప్రశ్నించిన సీపీఐ కార్యదర్శి ముత్తరసన్



ప్యారీస్, జూన్ 2: ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలన విజయాల గురించి లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ విమర్శించారు. తంజావూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం నిమిత్తం రాష్ట్రంలో పర్యటించిన సమయంలో ఒక విధంగా, ఉత్తరాది రాష్ట్రాల్లో మరో విధంగా కులమతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా మాట్లాడారని తెలిపారు. చిన్న గుడిసెలో ఉన్న బాలరాముడికి తాము అయోధ్యలో పెద్ద గుడి కట్టించి అందులో ప్రతిష్ఠించామని ప్రధాని చెప్పడం వల్ల దేశానికి ఒరిగేది ఏదీ లేదని తెలిపారు. 2014, 2019 సంవత్సరాల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను సక్రమంగా నెరవేర్చకుండా ప్రధాని మోదీ మోసం చేశారని, అందువల్లే ఆయన కన్నియాకుమారి సముద్రం మధ్య ఉన్న వివేకానంద రాక్ స్మారక మందిరంలో మూడు రోజులు మౌనంగా ధ్యానంలో గడిపారని, ఈ ధ్యానం వల్ల దేశం అభివృద్ధి చెందుతుందా అని ముత్తరసన్ బీజేపీ పెద్దలను ప్రశ్నించారు.

విద్యార్థులకు శిక్షణా తరగతులు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, జూన్ 2: తమిళనాడు సైన్స్ ఫోరం, వేలూరు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల సైన్స్ వేడుకలు కాట్పాడిలో జరిగాయి. కార్యక్రమానికి వేలూరు శాఖ అధ్యక్షురాలు దేవి అధ్యక్షత వహించగా, సెక్రటరీ శిలుపన్ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పిల్లలకు రాయడం, చదడవం, ఆరోగ్యం సహా పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అముద, నిర్వాహకులు రాజేంద్రన్, మాధవన్, ఎబినేసర్, జిల్లా సెక్రటరీ జనార్దనన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు శిబిర ఆర్గనైజర్లు సెంథమిల్ సెల్వన్, విశ్వనాధన్‌లు సర్టిఫికెట్లు అందజేశారు.


వేలూరు తందైపెరియార్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, అధికారులు


ఇళయరాజాకు టీఎంజేఏ ప్రత్యేక జ్ఞాపిక

ఇసైజ్ఞాని ఇళయరాజా 81వ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమిళ్ మూవీ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎంజేఏ) నిర్వాహకులు ఇళయరాజాను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఇళయరాజాకు ప్రత్యేక జ్ఞాపికను బహుమతిగా అందజేశారు. ఒక అరుదైన ఇళయరాజా ఫొటో ఆయనకు బర్త్‌డే కానుకగా అందజేశారు. కాగా, ఇళయరాజాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీఎంజేఏ అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి కోడంగి అబ్రహాం, సీనియర్ పాత్రికేయులు మీనాక్షి సుందరం, టీఎంజేఏ కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు. ఇళయరాజా బర్త్‌డేను పురస్కరించుకుని కోడంబాక్కంలోని ఇళయరాజా స్టూడియోలో అన్నదానం చేశారు.


ఇళయరాజాతో టీఎంజేఏ నిర్వాహకులు

ప్రియుడితో కలిసి సిడ్నీలో ప్రియా భవాని

కోలీవుడ్ హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ తన ప్రియుడితో కలిసి ఆస్ట్రేలియా దేశంలోని సిడ్నీ నగరంలో విహరిస్తున్నారు. తమ టూర్‌కు సంబంధించిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ అయ్యాయి. ప్రియా భవానీ శంకర్ తనతో కలిసి ఇంజనీరింగ్ చదివిన రాజవేలు అనే వ్యక్తిని గత కొన్నేళ్ళుగా ప్రేమిస్తున్న విషయం తెల్సిందే. అదేసమయంలో రాజవేలు ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన ప్రియుడిని చూసేందుకు ఆస్ట్రేలియా వెళ్లిన ప్రియ సిడ్నీ నగరంలో ప్రియుడితో కలిసి విహరిస్తూ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. ఈ విషయంపై ఆమె ఓ ట్వీట్ చేస్తూ, 'సిడ్నీ.. ప్రాక్టికల్‌గా నా రెండో ఇల్లు. ఇక్కడకు వచ్చిన లక్షలాది మంది ప్రజల్లో ఆ విషయాన్ని నేను చూశాను. ఎంతో సుందరమైన ప్రదేశం. దాదాపు ఆరేళ్ళ తర్వాత హృదయం ఉప్పొంగిన సంతోషంతో మళ్ళీ ఈ నగరానికి వచ్చాను. మాకు ఇష్టమైన ప్రదేశం మలేషియన్‌లో చాలా దూరం నడిచాం. కాఫీ తాగాను. మాట్లాడుకున్నాం. నవ్వుకున్నాం. ఈ అందమైన నగరాన్ని తనివితీరా చూశాం. ఇలాంటి మధురమైన క్షణాలు అందించిన ప్రపంచానికి ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. ఈ ట్వీట్ ప్రకారం చూస్తే... ప్రియా భవాని వివాహం చేసుకున్న తర్వాత సిడ్నీలో సెటిలయ్యేందుకు నిర్ణయించుకున్నట్టు సమాచారం.


ప్రియా భవానీ శంకర్

చిత్రజ్యోతి

అండమాన్ వెళ్లిన 'సూర్య-44' టీం

కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో హీరో సూర్య నటించే 44వ చిత్రంలో నటీనటుల పేర్లను అధికారికంగా ప్రకటించారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్, స్టోన్ బెంచ్ సంస్థలు సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందించనున్నారు. ఇందులో హీరోయిన్‌గా పూజా హెగ్డేను ఎంపిక చేయగా, ఇతర ముఖ్య పాత్రల్లో మలయాళ నటులు జయరాం, జోజు జార్జ్, కరుణాకరన్ తదితరులను ఎంపిక చేశారు. ఈ సినిమా మొదటి షెడ్యూల్ ఈ నెల మొదటి వారంలో అండమాన్‌లో ప్రారంభం కానుంది. ఇందుకోసం హీరో సూర్యతో పాటు చిత్ర యూనిట్ సభ్యులు ఆదివారం అండమాన్ బయలుదేరి వెళ్ళారు. ఇదిలావుంటే చిరుత్తై శివ - సూర్య కాంబినేషన్‌లో పదికిపైగా భాషల్లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'కంగువా' చిత్రం త్వరలోనే విడుదలకానుంది.


కార్తీక్ సుబ్బరాజ్ - సూర్య

'ఇండియన్-2' ఆడియో రిలీజ్

- ప్రత్యేక గెటప్‌లో కమల్!

ఎస్.శంకర్ దర్శకత్వంలో కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2' చిత్రం ఆడియో శనివారం నగరంలో రిలీజ్ చేశారు. ఈ వేడుకకు హీరో కమల్, వరుస హిట్‌లు అందిస్తున్న యంగ్ డైరెక్టర్లు నెల్సన్ దిలీప్ కుమార్, లోకేష్ కనకరాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా కమల్ ధరించిన దుస్తులు ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆడియో రిలీజ్ వేడుక శనివారం రాత్రి నెహ్రూ ఇండోర్ స్టేడియంలో భారీ స్థాయిలో జరిగింది. హీరో కమల్ బ్లాక్ కలర్ దుస్తులు ధరించి 'పారా' పాటకు మాస్ ఎంట్రీ ఇచ్చి ఆహూతులను అలరించారు. అలాగే, యంగ్ డైరెక్టర్లు లోకేష్ కనకరాజ్, నెల్సన్ దిలీప్ కుమార్, తెలుగు స్టార్ కమెడియన్ బ్రహ్మానందం, నటుడు బాబీ సింహా, హీరోయిన్లు కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, వసంత బాలన్, తంబిరామయ్య, పా.విజయ్ ఇలా అనేకమంది సినీ ప్రముఖులు ఈ ఆడియో వేడుకకు తరలివచ్చారు. ఈ ఈవెంట్‌లో దర్శకుడు శంకర్ మాట్లాడుతూ, 'అనిరుధ్‌తో కలిసి తొలిసారి పనిచేస్తున్నాను. ఈ చిత్రంలో ఆరు పాటలున్నాయి. బాగా వచ్చాయి. నేటి కాలంలో భారతీయ తాత (సేనాధిపతి) వస్తే ఎలా ఉంటుందన్నదే ఈ చిత్రం' అని పేర్కొన్నారు. లోకేష్ కనకరాజ్ మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్టు అనౌన్స్ చేసినప్పటి నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. కమల్, శంకర్, అనిరుధ్‌లను చూసినపుడల్లా ఈ సినిమా వివరాలు చెప్పాలని అడుగుతాను. ఎట్టకేలకు వచ్చే నెలలో విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు.


ఆడియో రిలీజ్ వేడుకలో కమల్, నెల్సన్, లోకేష్

ఉచిత ధోవతి, చీరలకు అనుమతులివ్వాలి

- మరమగ్గాల యజమానుల విజ్ఞప్తి

ప్యారీస్, జూన్ 2: తమిళుల పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా రేషన్‌కార్డుదారులకు ఉచితంగా ఇచ్చే ధోవతి, చీరల తయారీకి ప్రభుత్వం తమకు ఉత్తర్వులివ్వాలని తమిళనాడు మరమగ్గాల యూనిట్ల యజమానులు విజ్ఞప్తి చేశారు. ఈరోడ్‌లో ఆదివారం ఈ సంఘ రాష్ట్రస్థాయి నిర్వాహకుల సమావేశం జరిగింది. ఇందులో పలు కీలక తీర్మానాలు ఏకగ్రీవంగా సమావేశం ఆమోదించింది. నూలు ధరల పెంపు, తగ్గింపు, విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్త్రాలు తదితరాల కారణంగా రెండేళ్లగా నష్టపోతున్న మరమగ్గాల వృత్తిని ఆదుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా 40,000లకు పైగా మూసివేసిన మరమగ్గాల యూనిట్లు పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి తదితర డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో సుమారు 5.40 లక్షలకు పైగా ఉన్న మరమగ్గాల యూనిట్లలో దాదాపు 30 లక్షలకు పైగా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, ముఖ్యంగా కొంగు మండలంలో మాత్రమే 2.50 లక్షలకు పైగా ఉన్న యూనిట్లకు ఆర్థికసాయం ప్రకటించాలని ఈ సమావేశం కోరింది. సమావేశం అనంతరం తమిళనాడు మరమగ్గాల యూనిట్ల సంఘాల సమాఖ్య నిర్వాహకులు మాట్లాడుతూ... 238 స్పిన్నింగ్ కో-ఆపరేటివ్ సంఘాల ద్వారా 66 వేల మరమగ్గాల్లో పాఠశాల, పోలీసు యూనిఫాం, ఉచిత చీర, ధోవతుల ఉత్పత్తి జరుగుతోందని, ఇందువల్ల సంవత్సరంలో 6 నుంచి 7 నెలల వరకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. వచ్చే జనవరిలో పొంగల్‌కు 1.73కోట్ల చీరలు, 1.68 కోట్ల ధోవతులను ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉందని, దీనికి సంబంధించిన ఉత్పత్తి జూలైలో ప్రారంభమైతేనే డిసెంబరు నెలాఖరుకు ప్రభుత్వానికి సరఫరా చేయవచ్చని తెలిపారు.



నేటినుంచి పనిచేయనున్న హైకోర్టు



ఐసిఎఫ్, జూన్ 2: వేసవి సెలవుల అనంతరం మద్రాసు హైకోర్టు సోమవారం నుంచి పనిచేయనుంది. మేలో మద్రాసు హైకోర్టు, మదురై బ్రాంచ్‌కు వేసవి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో ముఖ్యమైన కేసులు మాత్రమే కోర్టులు విచారించాయి. నెలరోజుల అనంతరం ఆదివారంతో సెలవులు ముగియగా, సోమవారం నుంచి యధావిధిగా కోర్టులు పనిచేయనున్నాయి.

నేడు కరుణ 101వ జయంతి

- డీఎంకే ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



ప్యారీస్, జూన్ 2: మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 101వ జయంతిని పురస్కరించుకొని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే ఆధ్వర్యంలో వివిధ సంక్షేమ పథక సహాయాలు పంపిణీ చేయనున్నారు. మెరీనా బీచ్‌లోని కలైంజర్ కరుణానిధి స్మారక మండపంలో ఉదయం 9గంటలకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుష్పాంజలి ఘటించిన అనంతరం మాజీ సీఎం అన్నాదురై స్మారక మందిరం, ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలో ఉన్న కరుణానిధి విగ్రహం, కోడంబాక్కం మురసోలి ప్రాంగణంలో ఉన్న కరుణానిధి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు.కలైంజర్ 101వ జయంతి వేడుకలను అన్ని జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఘనంగా నిర్వహించి నివాళులర్పించడంతో పాటు అన్నదానం,వస్త్రదానం కార్యక్రమాలు నిర్వహించేందుకు డీఎంకే జిల్లా కార్యదర్శులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.డీఎంకే సీనియర్ నాయకులను గౌరవించి ఆర్థికసాయం అందజేయాలని, వైద్య శిబిరాలు, క్రీడా పోటీలు నిర్వహించేందుకు విజేతలకు బహుమతులు అందజేయాలని పార్టీ అధిష్ఠానం ఆదేశాలు జారీచేసింది.



మురుగన్ వేషంలో 800 మంది విద్యార్థినుల భరతనాట్యం

పెరంబూర్, జూన్ 2: తిరుచ్చి కేంద్రంగా పనిచేస్తున్న శివశక్తి అకాడమీ ఆధ్వర్యంలో, ప్రపంచ రికార్డు సాధించే దిశగా 800 విద్యార్థినులు ఒకే సమయంలో, ఒకే ప్రాంతంలో చేసిన భరతనాట్య ప్రదర్శన తిరుచెందూర్ భైరవాలయ సముద్రతీరంలో శనివారం జరిగింది. సెందూర్ అలై పాటలతో 'కలై అర్పణం' పేరుతో ఈ ప్రదర్శన నిర్వహించారు. 5 నుంచి 20 ఏళ్లలోపున్న విద్యార్థినులు మురుగన్ వేషంతో కావడి బట్టి 17 నిమిషాలు భరతనాట్యం చేసి రికార్డు సృష్టించారు. ఆసియా పసిఫిక్ రికార్డ్స్, రికార్డ్స్ ఆఫ్ ఇండియా సంస్థలు భరతనాట్యం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులకు సర్టిఫికెట్, పతకాలు, బహుమతులు అందజేశారు. ఒకే సమయంలో 800 మంది భరతనాట్యం చేయడం ప్రపంచ రికార్డు అని శివశక్తి అకాడమీ నిర్వాహకులు మీనా సురేష్ తెలిపారు.

కొడైకెనాల్‌లో పర్యాటకుల సందడి


పైన్ ఫారెస్ట్‌లో పర్యాటకులు

పెరంబూర్, జూన్ 2: 'కొండల యువరాణి'గా పేరుగాంచిన కొడైకెనాల్ పర్యాటకులతో సందడిగా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఊటీ, కొడైకెనాల్ తదితర పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ-పాస్ తప్పనిసరిగా కావడంతో పర్యాటకుల సంఖ్య కాస్త తగ్గింది. అదే సమయంలో, వేసవి ఉత్సవాల్లో భాగంగా పుష్ప ప్రదర్శన నిర్వహించడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరిగింది. అదే సమయంలో రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడం, కొడైకెనాల్ ప్రాంతంలో మోస్తరు వర్షాలు కురుస్తూ వాతావరణం చల్లగా, ప్రకృతి అందాలు రమణీయంగా ఉండడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరిగింది. అలాగే, రాష్ట్రంలో పాఠశాలలు ఈ నెల 6వ తేదీకి బదులు 10వ తేదీకి మారడంతో, కుటుంబాలతో సహా కొడైకెనాల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో కొడైకెనాల్ పర్యాటకులతో కిటకిటలాడింది. మేయర్ స్క్వయర్, గుణ గుహ, పైన్ ఫారెస్ట్, పిల్లర్ రాక్, కోకర్స్ వాక్, బ్రయంట్ పార్క్, రోజ్ పార్క్ ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి.

షవర్‌బాత్‌తో ఏనుగులు ఖుషీ...!


షవర్ బాత్ చేస్తున్న ఏనుగులు

పెరంబూర్, జూన్ 2: తిరుచ్చి జిల్లా మనచ్చనల్లూర్ సమీపం ఎమ్మార్‌పాళయం అటవీ రేంజ్ పరిధిలో ఏనుగుల పునరావాస శిబిరం ఉంది. జనావాసాల్లోకి ప్రవేశించడం, పంట పొలాలు ధ్వంసం చేయడం, మనుష్యులపై దాడిచేసే అడవి ఏనుగులను ఈ శిబిరానికి తరలించి, వాటికి గుమ్కీ శిక్షణ ఇస్తుంటారు. ప్రస్తుతం ఈ శిబిరంలో 10 ఏనుగులున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో, ఏనుగులు సేదతీరేలా షవర్ బాత్ ఏర్పాటుచేశారు. ఏనుగులు షవర్‌బాత్‌లో స్నానం చేస్తున్న దృశ్యాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

పారిశుధ్య పనులకు ఆధునిక వాహనాలు


ఆధునిక వాహనంతో కార్మికుల గస్తీ

పెరంబూర్, జూన్ 2: కోయంబత్తూర్ కార్పొరేషన్‌లో 'స్మార్ట్ సిటీ' పథకంలో భాగంగా గస్తీ, పారిశుధ్య పనులకు ఆధునిక వాహనాలు పరిచయం చేశారు. కోప్లర్, డోలివో అనే రెండు వాహనాలను పారిశుధ్య పనులకు, సేరియాట్ అనే వాహనాన్ని గస్తీ పనులకు వినియోగిస్తున్నారు. కోప్లర్ రకం వాహనం వేగంగా శుభ్రం చేసే సామర్థ్యం ఉంది. డోలివో వాహనంపై నిల్చొనే పారిశుధ్య పనులు చేసే విధంగా రూపొందించారు.

5,6 తేదీల్లో షోళింగర్‌లో రోప్‌కార్ సేవల నిలిపివేత

ప్యారీస్, జూన్ 2: రాణిపేట జిల్లా షోళింగర్‌లో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 5,6 తేదీల్లో రోప్‌కార్ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. షోళింగర్ ప్రాంతంలో 1,305 మెట్లతో కూడిన కొండపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. మెట్ల దారి గుండా వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం రోప్‌కార్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతినెలా మరమ్మతుల కోసం రెండు రోజులు ఈ సేవలు రద్దు చేస్తారు. వచ్చే బుధ, గురు వారాల్లో రోప్‌కార్ సేవలు నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



చల్ల...చల్లగా...

మెరీనాలో సేదతీరుతున్న ప్రజలు

పెరంబూర్, జూన్ 2: స్థానిక మెరీనా తీరం ప్రజలతో కిటకిటలాడుతోంది. చల్లని గాలులు, తీరం వెంబడి నీళ్లలో స్నానం చేస్తూ పిల్లలు, పెద్దలు ఆనందంగా గడుపుతున్నారు. నగరంలో వారం రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఎండ వేడితో పాటు వడగాల్పులకు ఇళ్లలో ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇళ్లలో ఏసీలున్నా, వాటిని ఎక్కువ సేపు వినియోగించి ఆర్థిక భారం మోయలేని పరిస్థితి మధ్యతరగతి ప్రజల్లో కనిపిస్తోంది. దీంతో, సాయంత్రం 4 గంటలకు ఇంటిల్లిపాది మెరీనాతీరానికి తరలి వెళ్తున్నారు. రాత్రి 8 గంటల అనంతరం వాతావరణం కొంత చల్లబడడంతో బీచ్ నుంచి ఇళ్లకు తిరుగు ప్రయాణమవుతున్నారు. అలాగే, మెరీనాలో సవారీ నడుపుతున్న వారు, తమ గుర్రాలను తీసుకెళ్లి సముద్రంలో స్నానం చేయిస్తూ ఉపశమనం కలిగిస్తున్నారు. ఇక, మెరీనా సమీపంలోని స్విమ్మింగ్ పూల్ పిల్లలు, యువకులతో కిటకిటలాడుతోంది. రానున్న రోజుల్లో నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయన్న వాతావరణ కేంద్రం ప్రకటనలతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.


ఎండ వేడి నుంచి గుర్రానికి ఉపశమనం


బీచ్‌లో స్నానం చేస్తూ ప్రజల కేరింతలు

మెరీనా తీరంలో జనసందోహం

